శనివారం ఆగస్టు 3, 2024

# ప్రజారోగ్యంపై దృష్టి తక్కువే

- సరిపడాలేని ప్రభుత్వ వ్యయం
- జనాభాకు తగినన్ని పడకలు లేవు



**ఈనాడు, హైదరాబాద్:** ఆరోగ్య రంగంపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న వ్యయం నిర్దేశించిన మొత్తంలో సగం కంటే తక్కువ ఉందని కాగ్ విశ్లేషించింది. జాతీయ ఆరోగ్య విధానం(ఎన్‌హెచ్‌పీ) 2017 ప్రకారం మొత్తం రాష్ట్ర బడ్జెట్‌లో వైద్య, ఆరోగ్య రంగానికి కేటాయింపులు 8% కంటే ఎక్కువగా ఉండాలని నిర్దేశించినా రాష్ట్రంలో కేటాయింపులు అందులో సగం కంటే తక్కువగానే ఉన్నాయని పేర్కొంది. 2016-17 నుంచి 2021-22 వరకు ఆరోగ్య రంగానికి కేటాయింపులు 2.53 నుంచి 3.47% వరకు మాత్రమే ఉన్నాయంది. ప్రజారోగ్య మౌలిక సదుపాయాలు, వైద్య, సేవల నిర్వహణపై కాగ్ నివేదికలో పలు అంశాలను పేర్కొంది. ఎన్‌హెచ్‌పీ 2025 నాటికి ఆరోగ్య రంగంపై వ్యయం రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 1.15% ఉండాలని, ప్రస్తుతం తెలంగాణలో 1% కంటే తక్కువగా ఉందని తెలిపింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 35,004 పడకలు అవసరం కాగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో 27,996 మాత్రమే అందుబాటులో ఉన్నాయంది.

## ఆరోగ్యంపై జేబు వ్యయం ఎక్కువే

రాష్ట్రంలో ఆరోగ్యంపై జేబు నుంచి ప్రజలు సొంతంగా ఖర్చు పెడుతున్న వ్యయం జాతీయ సగటుకంటే ఎక్కువ. జాతీయ సగటు 13 కాగా తెలంగాణలో 14.4%. 2030 నాటికి దీన్ని 7.83 శాతానికి తగ్గించాలనేది లక్ష్యం. రాష్ట్రంలో వైద్యవిద్య డైరెక్టరేట్ పరిధిలో ఖాళీలు 56% ఉన్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల్లో 48% అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్లో 46% ఖాళీలు ఉన్నాయి. వైద్య కళాశాలల్లో బోధనా సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. రాష్ట్రంలోని 122 పల్లె దవాఖానాల్లో వైద్యాధికారులే అందుబాటులో లేరు.

## మందుల కొనుగోళ్లలో లోపాలు

అత్యవసర మందుల జాబితాలను, అదనపు మందుల జాబితాలను రెండేళ్లకోసారి సమీక్షించాల్సి ఉన్నప్పటికి అలా జరగడంలేదు. ఆర్డర్లకు తగిన విధంగా మందులు సరఫరా చేయకున్నా ఆ సంస్థలపై చర్యలు తీసుకోలేదు. నిర్దేశించిన ధర కంటే ఎక్కువ మొత్తానికి మందులు కొనుగోలు చేశారు. గడువు ముగిసిన మందులను సరఫరాదారులతో సకాలంలో భర్తీ చేయించకపోవడంతో రాష్ట్రానికి రూ. 300.26 కోట్ల నష్టం వాటిల్లింది. 84 బ్యాచ్‌లలోని మందుల నాణ్యత సరిగాలేదని ఔషధనియంత్రణ మండలి నిర్ధారించినా వాటిలో 13 బ్యాచ్‌ల మందులను ఆరోగ్య కేంద్రాలకు సరఫరా చేశారు.

# వైద్య ఆరోగ్య శాఖలో మానవ వనరుల కొరత

- వైద్యసేవల నాణ్యతపై తీవ్ర ప్రభావం
- అనేక విభాగాల్లో 50 శాతానికి పైగా ఖాళీలు
- 2023 ఆగస్టు నాటి వివరాలను వెల్లడించిన కాగ్



➤ వైద్య విధాన పరిషత్‌లో 2023 ఆగస్టు నాటికి 4,311 మంది వైద్యుల పోస్టులకు 1,740 మందే ఉన్నారు. 2,571 (60 శాతం) ఖాళీలున్నాయి.

➤ వైద్య విద్య డైరెక్టరేట్(డీఎంఈ) పరిధిలో 1,412 మంది పారామెడికల్ సిబ్బందికి కేవలం 286 మంది మాత్రమే ఉన్నారు. 1,126 (80 శాతం) ఖాళీలున్నాయి.

➤ ప్రజారోగ్యశాఖలో 1,353 మంది పారా మెడికల్ సిబ్బందికి కేవలం 335 మందే ఉన్నారు. అంటే 75 శాతం ఖాళీలు.


ఈనాడు - హైదరాబాద్

వైద్య ఆరోగ్య శాఖలో మానవ వనరుల కొరత ఎక్కువగా ఉండగా, ఈ ప్రభావం వైద్యసేవల నాణ్యతపై తీవ్రంగా ఉంది. తాజాగా విడుదలైన కాగ్ నివేదికలోని గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. "2023 ఆగస్టులో రాష్ట్ర ఆరోగ్యశాఖ ద్వారా 12 వేల పోస్టులకు పైగా నియామక ప్రక్రియ ప్రారంభించినట్లు ప్రభుత్వం చెప్పింది. అయితే 2022 జూన్ నుంచి వివిధ కేడర్‌లలో ఆరోగ్య రక్షణ సిబ్బంది నియామకం కోసం నోటిఫికేషన్‌లు జారీ చేసినప్పటికీ భర్తీ చేసిన ఖాళీల వాస్తవ సంఖ్యను అందించలేదు" అని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక(కాగ్) పేర్కొంది. 2022 మార్చి వరకు వైద్య, ఆరోగ్య రంగంపై లోతుగా అధ్యయనం చేసిన కాగ్, తుది నివేదికలో 2023 ఆగస్టు నాటికి ఉన్న మానవ వనరుల వివరాలను వెల్లడించింది. దీని ప్రకారం కూడా అనేక విభాగాల్లో యాభై శాతానికి పైగా ఖాళీలు ఉండటం గమనార్హం. "అర్హత కలిగిన, అనుభవజ్ఞులైన మానవ వనరులను కలిగి ఉండటం ఆరోగ్య రక్షణ సేవలపై నేరుగా ప్రభావం చూపిస్తుంది. మానవ వనరుల విధానం ఐ.పి.హెచ్.ఎస్. ప్రమాణాలకు అనుగుణంగా ఉందని 2023 ఆగస్టులో ప్రభుత్వం పేర్కొన్నా, ఇందుకు సంబంధించిన వివరాలను మాత్రం అందించలేదు" అని కాగ్ వెల్లడించింది.


## సూపర్ స్పెషాల్టీ వైద్యుల కొరత

తనిఖీ చేసిన సూపర్ స్పెషాల్టీ/బోధనాసుపత్రులలో నిపుణులైన వైద్యులు 178 మందికి గాను 111 మందే ఉన్నారు. ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలోనే 66 మంది నిపుణులైన వైద్యులకు 45 మందే ఉన్నారు. ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రిలో 103 మంది నిపుణులైన వైద్యులకు కేవలం 51 మందే ఉన్నారు. ఇక్కడ పారామెడికల్, నర్సింగ్ సిబ్బంది కొరత ఇంకా ఎక్కువగా ఉంది. నిలోఫర్ ఆసుపత్రిలో నిపుణులైన వైద్యుల కొరత 38 శాతం ఉండగా, 70 శాతం నర్సింగ్ సిబ్బంది కొరత ఉంది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని వైద్య కళాశాలలు, బోధనాసుపత్రులలో వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది అంతా కలిపి 56 శాతం ఖాళీలు ఉన్నాయి.

కాగ్ తనిఖీ చేసిన ఆసుపత్రుల్లో 2023 మే నాటికి వైద్యుల పోస్టులు ఇలా...




కాగ్ తనిఖీ చేసిన ఆసుపత్రుల్లో 2023 మే నాటికి నర్సుల పోస్టులు ఇలా...




## నివేదికలోని ముఖ్యాంశాలు ఇలా...

తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) ఆధ్వర్యంలో పని చేస్తున్న సంస్థలలో సిబ్బంది కొరత స్పష్టంగా ఉంది. ప్రాథమిక, ద్వితీయ స్థాయి సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచే ఈ విభాగంలో వైద్యులు 60శాతం, ఏఎన్ఎం/ఎంపీ హెచ్ఏలు 56 శాతం, పారామెడికల్ ఉద్యోగులు 46 శాతం, నర్సింగ్ సిబ్బంది 21 శాతం, ఇతర సిబ్బంది 25 శాతం ఖాళీలున్నాయి. కాగ్ తనిఖీ చేసిన అన్ని ఆసుపత్రుల్లోనూ వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది ఖాళీలు ఎక్కువగా ఉన్నాయి.

**2022 మార్చి నాటికి వైద్య, ఆరోగ్యశాఖలోని వివిధ శాఖాధిపతుల విభాగాల్లో ఖాళీల వివరాలు ఇలా...**

| శాఖాధిపతి విభాగం | మంజూరైన సిబ్బంది | పని చేస్తున్న సిబ్బంది | ఖాళీలు | ఖాళీల శాతం |
|---|---|---|---|---|
| ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ | 6,165 | 4,028 | 2,137 | 35 |
| ప్రజారోగ్య సంచాలకులు | 13,769 | 8,207 | 5,562 | 40 |
| తెలంగాణ వైద్య విధానపరిషత్ | 10,822 | 6,196 | 4,626 | 43 |
| వైద్య విద్య సంచాలకులు | 11,499 | 5,052 | 6,447 | 56 |
| ఔషధ నియంత్రణ పరిపాలన | 198 | 131 | 67 | 34 |
| ఆయుష్ విభాగం | 2,691 | 1,311 | 1,380 | 51 |
| వ్యాధి నిరోధక వైద్య పద్ధతుల సంస్థ | 391 | 181 | 210 | 54 |
| మొత్తం | 45,535 | 25,106 | 20,429 | |

# శాఖల నుంచి సమాచారం ఇప్పించండి

- సీఎంకు బీసీ కమిషన్ ఛైర్మన్ వినతి

**ఈనాడు, హైదరాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు కోసం అధ్యయనానికి అవసరమైన సమాచారాన్ని ప్రభుత్వ శాఖలు, జిల్లా కలెక్టర్లు అందించేలా ఆదేశాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు కోరారు. ఈమేరకు సీఎంకు ఆయన శుక్రవారం రాత్రి వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికే అధ్యయన సమాచారం కోసం ప్రభుత్వ శాఖలకు లేఖలు రాశామని, ఆ వివరాలు త్వరగా అందిస్తే సకాలంలో నివేదికలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఇప్పటివరకు కమిషన్ నిర్వహించిన అధ్యయనంపై సమాచార పత్రాలను సీఎంకు అందజేసినట్లు తెలిపారు.

# 'సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్' ఏర్పాటు చేయండి: వినోద్‌కుమార్

హైదరాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో 'తెలంగాణ అధ్యయనాల కేంద్రం, మల్టీడిసిప్లినరీ రీసెర్చ్ సెంటర్'(సెంటర్ ఫర్ తెలంగాణ స్టడీస్) ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. తెలంగాణ ప్రాంతంలోని సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, భాషాపరమైన అంశాలపై లోతుగా పరిశోధించడం, వాటిలో అకడమిక్ ఎక్సలెన్స్‌ను ప్రోత్సహించడం ఈ కేంద్రం లక్ష్యమని పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, ధర్మేంద్ర ప్రధాన్‌లకు ఆయన శనివారం లేఖలు రాశారు. ఈ కేంద్రం ఏర్పాటుతో రాష్ట్రానికి సంబంధించిన విధానాల రూపకల్పన, అభివృద్ధి వ్యూహాలకు విలువైన డేటా అందుతుందన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రుల్లో తగ్గిన సిజేరియన్ ప్రసవాలు

## 60 నుంచి 39 శాతానికి తగ్గినట్లు కాగ్ నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో 2017–18 మధ్య కాలంలో 60 శాతంగా ఉన్న సిజేరియన్ ప్రసవాలు 2021–22 నాటికి 39 శాతానికి తగ్గాయని కాగ్ నివేదిక వెల్లడించింది. కాగా, ప్రైవేట్ ఆస్పత్రుల్లో మాత్రం అదే కాలంలో 40 శాతం నుంచి 61 శాతానికి పెరిగాయని పేర్కొంది. 2019 నాటికి కంటివెలుగు పథకం కింద 1.55 కోట్ల మందికి కంటి పరీక్షలు నిర్వహించారని తెలిపింది. 2011 లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభాకు 35,004 పడకలు అవసరం కాగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో 27,996 పడకలు అందుబాటులో ఉన్నాయంది. ఫలితంగా 7,008 పడకల కొరత ఏర్పడిందని కాగ్ పేర్కొంది. తెలంగాణలో వైద్యుల లభ్యత పెరుగుతున్న ధోరణి ఉందని కాగ్ వెల్లడించింది. 881 మందికి ఒక వైద్యుడు అందుబాటులో ఉన్నారని ప్రస్తావించింది. మంజూరైన పోస్టులకు ఆస్పత్రుల్లో ఉన్న సిబ్బందికి భారీ తేడా ఉందని తెలిపింది. 45 శాతం ఖాళీలు ఉన్నాయంది. 9 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అసోసియేట్ కేడర్‌లో 48 శాతం, అసిస్టెంట్ ప్రొఫెసర్/ట్యూటర్ల కేడర్‌లో 40 శాతం ఖాళీలు ఉన్నట్లు పేర్కొంది. దీంతో వైద్య విద్య నాణ్యతపై ప్రభావం చూపుతుందని ప్రస్తావించింది.

# రూ.390 కోట్ల విలువైన
# మెడిసిన్ వృథా

**2016 - 2022 వరకు మెడిసిన్ కొనుగోలులో భారీగా ఉల్లంఘనలు**

**సర్కారు దవాఖాన్లకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం**

**నాసిరకం మందులు సప్లై చేసినట్టు వెల్లడించిన కాగ్**

**మ్యాండేటరీ టెస్టింగ్‌కు కూడా పంపలేదని వెల్లడి**





# రూ.390 కోట్ల విలువైన మెడిసిన్ వృథా

## 2016 -2022 వరకు మెడిసిన్ కొనుగోలులో భారీగా ఉల్లంఘనలు



**హైదరాబాద్, వెలుగు:** గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో మెడిసిన్ కొనుగోలులో భారీగా నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని కాగ్ వెల్లడించింది. 2016 నుంచి 2022 వరకు కొనుగోలు చేసిన మెడిసిన్‌లో సుమారు రూ.390.26 కోట్ల విలువైన మందులు పేషెంట్లకు అందుకుండానే ఎక్స్‌పైరీ అయ్యాయని పేర్కొంది. ఈ మేరకు 2016 నుంచి 2022 సంవత్సరాలకు సంబంధించిన కాగ్ రిపోర్టును ప్రభుత్వం శుక్రవారం శాసన సభలో టేబుల్ చేసింది. సుమారు 54 బ్యాచ్‌ల మెడిసిన్‌ను టెస్టింగ్ చేయించకుండానే హాస్పిటళ్లకు సప్లై చేశారని, ఇందులో 47 బ్యాచుల మెడిసిన్‌ను పేషెంట్లకు ఇచ్చారని పేర్కొంది. ఈ అంశంపై గత ప్రభుత్వం ఇచ్చిన వివరణ సరిగా లేదని కాగ్ పేర్కొంది. ఇక గత ప్రభుత్వం కొనుగోలు చేసిన వాటిలో 84 రకాల మందులు నాసిరకంగా ఉన్నట్టు టెస్టింగ్ ల్యాబ్స్ తేల్చాయని వెల్లడించింది. దీనిపై గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని వివరణ కోరగా.. రూ.346.16 కోట్ల విలువైన మెడిసిన్‌కు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయకపోవడం వల్లే అవి ఎక్స్‌పైరీ అయినట్టుగా పోర్టల్‌లో చూపించిందని, వాస్తవానికి అవి పేషెంట్లకు సప్లై చేశామని తెలిపినట్టు కాగ్ వెల్లడించింది. మరో రూ.21.22 కోట్లను కంపెనీలకు చెల్లించలేదని, రూ.1.88 కోట్ల ఎక్స్‌పైరీ మెడిసిన్‌ను కంపెనీలకు పంపించి, తిరిగి మంచి మెడిసిన్‌ను తీసుకున్నట్టు గత ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. అయితే, ఇందుకు సంబంధించిన ఆధారాలేవీ సమర్పించలేదని కాగ్ పేర్కొంది. డాక్టర్లు కోరిన వాటిలో చాలా మందులను గత ప్రభుత్వం హాస్పిటళ్లకు సప్లై చేయలేదని కాగ్ స్పష్టం చేసింది.

**నాసిరకంగా మెడికల్ ఎడ్యుకేషన్**

ఇక ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, హాస్పిటళ్లలో 45 శాతం పోస్టులు (2022 నాటికి) ఖాళీగా ఉన్నాయని కాగ్ వెల్లడించింది. అత్యధికంగా మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని హాస్పిటళ్లు, కాలేజీల్లో 56 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలిపింది. 48 శాతం అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు, 40 శాతం అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు వెల్లడించింది. ఈ ఖాళీల వల్ల మెడికల్ ఎడ్యుకేషన్ నాసిరకంగా తయారైందని కాగ్ పేర్కొంది.

# రాష్ట్ర బడ్జెట్‌లో 2.53 శాతం నుంచి 3.47 శాతమే ఖర్చు

- ఎన్‌హెచ్‌ఎంకు నిధులు విడుదల చేయని వైనం
- ఆరోగ్యరంగంపై కాగ్ నివేదిక విడుదల

**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

2016-17 నుంచి 2021-22 ఆర్థిక సంవత్సరాల మధ్య కాలంలో ఆరోగ్య రంగానికి సంబంధించి 2.53 శాతం నుంచి 3.47 శాతం మాత్రమే ఖర్చు చేసిందని కాగ్ నివేదిక వెల్లడించింది. రాష్ట్రంలో ప్రజారోగ్యానికి సంబంధించిన మౌళిక సదుపాయాలు, ఆరోగ్య సేవల నిర్వహణ (2022 మార్చితో ముగిసిన సంవత్సరానికి సంబంధించిన) కాగ్ నివేదికను శుక్రవారం రాష్ట్ర శాసనసభకు సమర్పించారు. ఆరోగ్య రంగానికి నిర్దేశించిన దానిలో 50 శాతం కంటే తక్కువే వ్యయం చేసినట్టు పేర్కొంది.

జాతీయ ఆరోగ్య మిషన్ పథకం కింద రాష్ట్ర వాటా అందించకపోవడంతో 2017 -22 మధ్య కాలంలో గ్రామీణ ఆరోగ్య, పారిశుధ్య, పోషకాహార సమితుల సభ్యులకు అవసరమైన తప్పనిసరి శిక్షణలు నిలిచిపోయాయి. కోవిడ్-19 నిర్వహణ కోసం 2020 డిసెంబర్ - 2021 సెప్టెంబర్ మధ్య కాలంలో ఎన్‌హెచ్‌ఎం నిధుల నుంచి తీసుకున్న రూ.144.17 కోట్ల తిరిగి భర్తీ చేయలేదు. రాష్ట్రంలో సి-సెక్షన్ ప్రసవాలు 2017-18 నుంచి 2021-22 మధ్య కాలంలో 56 నుంచి 62 శాతానికి పెరిగాయి.

**ఆరోగ్య నిపుణుల కొరత**

రాష్ట్రంలో ఆరోగ్యంపై నెలవారీ ఖర్చు జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉంది. ప్రతి 10 వేల మంది జనాభాకు 45 మంది ఆరోగ్య నిపుణులు ఉండాలనే లక్ష్యం ఉండగా కేవలం 10 మందితో రాష్ట్రం చాలా వెనుకబడి ఉంది.

# ఖాళీగా వైద్య, ఆరోగ్యశాఖ

**• మంజూరైన పోస్టుల్లో 45శాతం మేర ఖాళీలు • ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకల కొరత • 536 అత్యవసర మందుల్లో అందుబాటులో ఉన్నవి కొన్నే • తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖపై కాగ్ నివేదికలో సంచలన విషయాలు**

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖలో పెద్ద సంఖ్యలో వైద్యులు, సిబ్బంది ఖాళీల కారణంగా పేదలకు మెరుగైన ప్రభుత్వ వైద్యం అందడంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాగ్ ( కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ) స్పష్టం చేసింది. వైద్య, ఆరోగ్యశాఖలో వివిధ విభాగాల్లో మంజూరైన పోస్టులకు, అందుబాటులో ఉన్న ఆరోగ్య సంరక్షణ సిబ్బందిని పోల్చి చూస్తే భారీ అంతరం కనిపిస్తోందని ఆక్షేపించింది. వైద్య, ఆరోగ్యశాఖలో 45 శాతం ఖాళీలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వానికి తలంటింది. వైద్య విద్య సంచాలకుల్లో 56శాతం ఖాళీలు ఉండగా, ఔషధ నియంత్రణ విభాగంలో 34శాతం మేరఖాళీలు ఉన్నాయని పేర్కొంది. ఈ మేరకు 2022తో ముగిసిన సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రంలో ప్రజారోగ్యానికి సంబంధించిన మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సేవల నిర్వహణ అంశంపై ఆడిట్ నివేదికను శుక్రవారం శాసనసభ ముందుంచింది.

2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభాకు 35004 పడకలు అవసరంకాగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో 27,996 పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, ఆదిలాబాద్, హైదరాబాద్, హన్మకొండ జిల్లాలు మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో పడకల కొరత తీవ్రంగా ఉందని కాగ్ తేల్చి చెప్పింది.

వైద్య విద్య విభాగం పరిధిలోని 9 వైద్య కళాశాలల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, దీని ప్రభావం వైద్య విద్యార్థులకు అందే విద్యా నాణ్యతా ప్రమాణాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. గ్రామీణ ప్రజలకు ఎప్‌డీహెచ్ఎస్ ఆరోగ్యసేవలు సమర్థంగాఅందడం లేదని, 3206 పల్లె దవాఖానాల్లో 122 చోట్ల అసలు వైద్యాధికారులే అందుబాటులో లేరని ఆక్షేపించింది. వివిధ విభాగాల ఆసుపత్రుల్లో ఓపీ సేవల జాబితాలో ఉన్న కొన్ని ఆరోగ్య సేవలు రోగులకు అందడం లేదని గుర్తించినట్లు కాగ్ పేర్కొంది.

ఉస్మానియా, నీలోఫర్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రితోపాటు పలు జిల్లాల్లోని సర్కారు ఆసుపత్రుల్లో నర్సులకు పనిభారం పెరుగుతోందని, నిబంధనలకు మించి ఎక్కువ మంది రోగులకు వారు సేవలందించాల్సి వస్తోందని , అది సాధారణం కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువని లోపాలను ఎత్తి చూపింది. నర్సంపేట జిల్లా ఆసుపత్రి మినహా మరే ఆసుపత్రిలోనూ మైక్రో బయాలజీ సేవలు అందుబాటులో లేవని మండిపడింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాద నిరోధక ఏర్పాట్లు తగినంతగా లేవని, అగ్నిప్రమాద భద్రత ప్రమాణాలకు అనుగుణంగా లేదని తేల్చి చెప్పింది.

అత్యవసర మందుల జాబితాపై ఎప్పటికప్పుడు సమీక్షలు జరగడం లేదని కాగ్ స్పష్టం చేసింది. ఈఎమ్ఎల్ జాబితా ప్రకారం 530 రకాల ఔషధాలు కొనుగోలు చేయాల్సి ఉండగా ప్రతి సంవత్సరం కనీసం 50శాతం కూడా కొనుగోలు జరగడం లేదని నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపింది. ఈ- ఔషధి అమలు కావడం లేదని స్పష్టం చేసింది. కాంట్రాక్టులోని ధరలకు విరుద్ధంగా అధిక రేట్లకు ఔషధాల కొనుగోళ్లకు ఆర్డర్ ఇవ్వడంతో తొమ్మిది కాంట్రాక్టర్లకు రూ.1.65కోట్లు అధనంగా చెల్లింపులు జరిగాయని తేల్చింది. ఈ-ఔషధి డేటా ప్రకారం గడువు ముగిసిన మందుల స్థానంలో కొత్తవాటిని సరఫరాదారుల నుంచి సేకరించకపోవడంతో రూ.390. 6కోట్ల నష్టం వాటిల్లిందని చెప్పింది. పలు ఔషధాలు ప్రమాణాల మేరకు లేవని కూడా చెప్పింది. హైదరాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్‌లోని ఔషధ డిపోలను తనిఖీ చేయగా మందులు దెబ్బతినడం, కలుషితమవడం, దొంగతనానికి గురవడం వంటి లోపాలు కనిపించాయని నివేదికలో కాగ్ పేర్కొంది.

నిర్మాణంలో ఉన్న దవాఖానాల విషయంలో రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ సమగ్ర డేటా బేస్‌ను నిర్వహించడం లేదని ఆక్షేపించింది. పలు జిల్లాల్లో ఏకీకృత ఆయూష్ ఆసుపత్రులు అందుబాటులోకి రాలేదని, దాంతో 7.20కోట్ల కేంద్ర నిధులను రాష్ట్రం కోల్పోయిందని కాగ్ తేల్చి చెప్పింది. ఉస్మానియా వైద్య కళాశాల అకడమిక్ భవనంలో ఫర్నిచర్, ఇతర సదుపాయాలు లేని కారణంగా రూ.17.35 కోట్లు నిష్ఫలంగా మారాయని మండిపడింది. వ్యాధి నిర్ధారణ, సాంక్రమిక వ్యాధుల అధ్యయనానికి సంబంధించి ఆరోగ్య సర్వేలను ప్రభుత్వం నిర్వహించలేదని ఆరోపించింది.

# సరిపడా ఆస్పత్రులు, వైద్యులేరి?

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనాభాకు సరిపడా ప్రభుత్వాస్పత్రులు లేవని.. ఉన్న చోట్ల వైద్యులూ లేరని.. అవసరమైన స్థాయిలో పడకలూ లేవని కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) తీవ్రంగా ఆక్షేపించింది. తెలంగాణలో ఆస్పత్రులు, వైద్యుల కొరత తీవ్రంగా ఉందని.. ఒకస్థాయి ఆస్పత్రుల్లోనూ 45%, మరో స్థాయి ఆస్పత్రుల్లో 56% ఖాళీలున్నాయని పేర్కొంది. ప్రజావసరాలకు అనుగుణంగా సామాజిక ఆరోగ్య కేంద్రాలు(సీహెచ్‌సీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ) ఉప కేంద్రాలు (సబ్‌సెంటర్స్) లేవని వెల్లడించింది. సీహెచ్‌సీలు 69%, పీహెచ్‌సీలు 25%, ఉప కేంద్రాలు 29% కొరతతో ఉన్నట్లు పేర్కొంది. ఈ మేరకు తెలంగాణలో ప్రజారోగ్యానికి సంబంధించిన మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సేవల నిర్వహణపై 2016-17 నుంచి 2021-22 మార్చితో ముగిసిన ఏడాదికి కాగ్ ఆడిట్ సమీక్ష నిర్వహించి, నివేదికను విడుదల చేసింది. జనగాం, సిరిసిల్ల, హన్మకొండ జిల్లాల్లో సీహెచ్‌సీలే లేవని, చాలా జిల్లాల్లో పీహెచ్‌సీలు, సబ్ సెంటర్స్ సంఖ్య నిబంధనల మేరకు తగినన్ని లేవని తేల్చి చెప్పింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 35,004 పడకలు అవసరమైతే సర్కారు దవాఖానాల్లో కేవలం 27,996 ఉన్నాయని, 7,008 పడకల కొరత ఉన్నట్లు పేర్కొంది. ఆదిలాబాద్, హైదరాబాద్, హన్మకొండ జిల్లాల మినహా మిగతా అన్నింటా పడకల కొరత ఉన్నట్లు వెల్లడించింది. ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్ నిబంధన ప్రకారం చూస్తే ప్రభుత్వ ఆస్పత్రుల్లో 45 శాతం ఖాళీలున్నాయి. మంజూరైన పోస్టులు, పనిజేస్తున్న సిబ్బంది మధ్యన భారీ తేడాలున్నాయి. వైద్యవిధాన పరిషత్తులో 10,822 పోస్టులు మంజూరు కాగా, 6196 మందే ఉన్నారు. ఎల్టీ పోస్టులు 391 మంజూరు కాగా, 181 మందే ఉన్నారు. ఆయుష్ విభాగంలో 2691 మంజూరు కాగా 1311 మందే ఉన్నారు. అంటే 51 శాతం ఖాళీలున్నాయి. ఇక జిల్లా ఆస్పత్రుల్లో 1524 పోస్టులు మంజూరు అవ్వగా 696 ఖాళీలున్నాయి. వైద్యుల కేడర్‌లో 801 పోస్టులకు గాను 419 మంది, నర్సింగ్‌లో 638 పోస్టులకు 241 మంది నర్సులే ఉన్నారు. మెడికల్ కాలేజీల్లో అధ్యాపకుల కొరత చాలా తీవ్రంగా ఉంది. తనిఖీలు చేసిన 9 మెడికల్ కాలేజీల్లో అసోసియేట్ ప్రొఫెసర్ కేడర్‌లో 48శాతం, అసిస్టెంట్‌లో 40 శాతం ఖాళీలున్నట్లు కాగ్ రిపోర్టులో వెల్లడైంది.

## కాగ్ నివేదికలో ముఖ్యాంశాలు

- గడువు ముగిసిన మందులను గుర్తించకపోవడంతో ప్రభుత్వానికి రూ.390 కోట్ల నష్టం వాటిల్లింది.
- ఉస్మానియా ఆస్పత్రిలో అకడమిక్ భవనాన్ని నిర్మించి 2016 అక్టోబరులో అప్పగించినా పరికరాలు, ఫర్నీచర్ లేని కారణంగా వాడుకలోకి తీసుకురాకపోవడంతో 17.35కోట్లు వృథా అయ్యాయి.
- 14 జిల్లా ఆస్పత్రుల్లో చెవి, ముక్కు, గొంతు, అన్నవాహిక, కడుపు, పెద్దపేగు, బ్రోంకోస్కోపి, ఆర్థ్రోస్కోపీ, హిస్టెరోస్కోపీకి సంబంధించిన రోగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో లేవు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య జనాభా, అంటువ్యాధి తార్కికమైన సర్వేలను నిర్వహించలేదు.
- నేషనల్ హెల్త్ పాలసీ ప్రకారం రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఆరోగ్య రంగానికి 8 శాతం కంటే ఎక్కువగా ఉండాలి. కానీ 2016-22 మధ్య కాలంలో 2.53 నుంచి 3.47 శాతం మధ్య ఉంది.
- రాష్ట్రంలో సీజేరియన్ ప్రసవాల రేటు జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉన్నాయి. 2017-2022 మధ్య కాలంలో సీ సెక్షన్ 56 నుంచి 62 శాతానికి పెరిగాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సీ సెక్షన్ రేటు 60 శాతం నుంచి 39 శాతానికి తగ్గగా... ప్రైవేటులో అది 40 నుంచి 61 శాతానికి పెరిగింది.

# ఆరోగ్య నిర్వహణలో అవకతవకలు

## బోధనా విభాగంలో ఖాళీలతో వైద్య విద్యపై తీవ్ర ప్రభావం

## నీతి ఆయోగ్ వార్షిక సూచీ ప్రకారం తెలంగాణ స్కోరు 67

## అసెంబ్లీలో కాగ్ నివేదిక ప్రవేశపెట్టిన ప్రభుత్వం

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** 2016 17 నుంచి 2021 22 సంవత్సరానికి తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఈ నివేదికలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజారోగ్యానికి సంబంధించిన మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సేవల నిర్వహణపై విర్వహించిన ఆడిట్ సమీక్షలో కనుగొన్న ప్రధాన అంశాలను ఈ నివేదికలో పొందుపరిచారు. మచ్చుకు చేసిన తనిఖీలలో భారతీయ ప్రజారోగ్య ప్రమాణాల నిబంధనల ప్రకారం ఆరోగ్య సంరక్షణ సదుపాయాల అవసరాన్ని తీర్చడానికి నిపుణులైన వైద్యులు వైద్యాధికారులు ఇతర వైద్య అనుబంధ సిబ్బంది నియామకం కోసం మానవ వనరుల విభాగాన్ని తయారు చేయడం జరిగింది. అయితే, దీనికి సంబంధించిన సంపూర్ణ నివేదికను రాష్ట్ర వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ సమర్పించలేదని వెల్లడించింది.

ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం ప్రతీ 1000 మందికి ఒక వైద్యుడు అందుబాటులో ఉండాల్సి ఉండగా, తెలంగాణ రాష్ట్రంలో వైద్యుల అందుబాటు లభ్యత 2017 నుంచి 22 వరకు 1 : 881 నిష్పత్తిగా ఉంది. అలాగే, వైద్య,ఆరోగ్య శాఖలో మంజూరైన పోస్టులకు, ఆరోగ్య సదుపాయాలలో ఉన్న ఆరోగ్య సంరక్షణ సిబ్బంది వాస్తవ స్థితికి మధ్య భారీగా అంచనాలు ఉన్నట్లు కాగ్ నివేదిక వెల్లడించింది. మొత్తం ఖాళీలు 45 శాతంగా ఉన్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్ల కేడర్‌లో 48 శాతం, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు కేడర్‌లో 40 శాతం, ఖాళీలతో మొత్తం 9 వైద్య కళాశాలల్లో బోధనా సిబ్బందికి సంబంధించి తీవ్ర కొరతను గమనించినట్లు పేర్కొంది. అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులలో ఖాళీలు వైద్య విద్యార్థులకు అందించే వైద్య విద్య నాణ్యతపై ప్రభావం చూపుతాయని కాగ్ నివేదికలో వెల్లడించింది. అలాగే, ఎన్‌హెచ్ఎం కింద తెలంగానలో అన్ని కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం క్షయ వ్యాధి కేసుల ప్రటకన ప్రజారోగ్య సంస్థలకు సంబంధించిన తగ్గుతున్న ధోరణిని చూపిందని వివరించింది. అలాగే, జాతీయ మలేరియా నిర్మూలన కార్యక్రమం కింద 2017 21 కాలంలో 8 జిల్లాల్లో వార్షిక రక్త పరీక్ష రేటు నిరంతరంగా 10 శాతం కంటే తక్కువగా ఉందని కాగ్ నివేదిక పేర్కొంది. నీతి ఆయోగ్ సూచిక ప్రకారం తెలంగాణ 67 స్కోరుతో ఉన్నప్పటికీ ప్రసూతి మరణాల రేటు, ఇమ్యునైజేషన్, నవజాత శిశువుల మరణాల రేటు, సంస్థాగత ప్రసవాలు వంటి అంశాలలో తెలంగాణ మంచి ప్రతిభ కనబరిచిందని పేర్కొంది అయినప్పటికీ నిర్దిష్ట సూచికలకు సంబంధించి అంటే 10000 జనాభాకు మొత్తం వైద్యులు, నర్సులు, ఆత్మహత్యల రమణాల రేటు, రోడ్డు ట్రాఫిక్ ప్రమాదాల కారణంగా మరణాల రేటు, సిజేరియన్ ప్రసవాలు మొదలైన వాటిలో ఇంకా మెరుగుదలకు అవకాశం ఉందని కాగ్ నివేదిక వివరించింది.

